## క్లుప్తంగా

### రీసైక్లింగ్ సేకరణ కేంద్రాలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సుజాత

**సత్తుపల్లిటౌన్:** ఈ నెల 20 నుంచి జూన్ 5 వరకు సత్తుపల్లి మున్సిపాలిటీలో ఐదు రీసైక్లింగ్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.సుజాత తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇళ్లల్లో వాడకుండా ఉన్న నోట్‌పుస్తకాలు, పాత దుస్తులు, చెప్పులు, ప్లాస్టిక్ బాటిల్స్ తదితర వస్తువులను ఈ కేంద్రాల్లోకి సేకరించాలని సిబ్బందికి సూచించారు. అత్యధికంగా సేకరించిన వారికి అవార్డులు అందిస్తామన్నారు. సమావేశంలో ఏఈ సురేష్, మేనేజర్ శ్రీనివాసరావు, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాత, మెప్మా సీఓలు ప్రసాద్, నరేష్, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### న్యాయం చేయాలి



తమిళిసై సౌందర రాజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామలింగేశ్వరరావు

**సత్తుపల్లి:** సింగరేణి బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో నూతనంగా ఇళ్లు నిర్మించాలని, తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ని బీజేపీ ఖమ్మంజిల్లా పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఖమ్మంలో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. సింగరేణి యాజమాన్యం వెంటనే రూ.40 కోట్లు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రదీప్, శ్యామ్‌సుందర్‌నాయక్, రవి, అంజయ్య, చావా కిరణ్, విక్రమ్ పాల్గొన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం

**కల్లూరు రూరల్:** మండలంలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో పోట్రు లక్ష్మయ్య మెమోరియల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. పోట్రు కిరణ్, ప్రవీణ్ సారథ్యంలో గ్రేస్ ఫౌండేషన్, తానా ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేన్సర్ స్కానింగ్ మహిళలకు నిర్వహించి, అలాగే బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బీరవెల్లి రఘు, సర్పంచ్ పద్మప్రసాద్, వైద్యులు శ్రీకాంత్, కిరణ్, ప్రవీణ్, ట్రస్టు సభ్యులు నరేష్, శ్రీనివాస్, మహేష్, అశోక్, మురళి పాల్గొన్నారు.

### 'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

**చింతకాని:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గ్రామసర్పంచ్‌లు చాట్ల సురేష్, పరిటాల యలమంద తెలిపారు. మండల పరిధిలో నాగిలిగొండ, నాగులవంచ రైల్వే కాలనీ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాలను బుధవారం గ్రామసర్పంచ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు భగవాన్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, గ్రామపెద్దలు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### రేపు రైతులకు అవగాహన సదస్సు

**వైరా:** వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19న శుక్రవారం నాడు రైతులకు నూతన వ్యవసాయ విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్ రీజనల్ అగ్రికల్చర్ రిసెర్చ్ స్టేషన్ (రార్స్ వరంగల్), ఆటోమోటివ్ రోబోటిక్స్ ఇండియా (ఏఆర్ఐ) హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్తలు నూతన వరి వంగడాలు, వ్యవసాయంతో నూతన శాస్త్రీయ పద్ధతులు, పంట అదును కాలం ముందుగా ఏర్పాటు చేయడం తదితర విషయాలపై రైతులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు.

### రోడ్లపై ఎండవేడిమి నివారణ చర్యలు

**ఎర్రుపాలెం:** మండుతున్న వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎన్.తిరుమలాచారి, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావులు ఎండవేడిమి నివారణ చర్యలు చేపట్టారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారులపై వాటర్ ట్యాంకర్లతో నీటిని చల్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి అప్పారావు, సెక్రటరీ ఎన్ నాగేశ్వర రావు తదితరులు ఉన్నారు.

# వసతులేవి..?



ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- మండుటెండలో 'ఉపాధి'కూలీలు
- తాగునీరు, మజ్జిగ పంపిణీ ఊసేలేదు
- కనిపించని టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు

**వేంసూరు :** రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో ఉపాధిహామీ కూలీలు పనులు చేసే చోట ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చట్టం ప్రకారం వేసవిలో ఉపాధి కూలీలకు పనిచేసే చోట కనీస వసతులు కల్పించాలి. ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. ఎండలో పనులు చేసేవారు కాసేపు సేద తీరడానికి టెంట్లు ఏర్పాటు చేయాలి. కూలీలకు మజ్జిగ, మంచినీరు అందించాలి. కానీ ఇవేవి లేవు. ఉదయం 8 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చడంతో కూలీలు పనులు చేయలేక అల్లాడిపోతున్నారు. అయినా అధికారులు కూలీలకు సౌకర్యాలు కల్పించాలని అనుకోవడం లేదు.

**మొత్తం ఉపాధి కూలీలు 11,108 మంది..**

మండలంలో మొత్తం సుమారు 11,108 జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 2,400 మంది కూలీలు పని చేస్తున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశంలో టెంట్లు అందుబాటులో లేకపోవడంతో కూలీలు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు.

**కానరాని ప్రథమ చికిత్స కిట్లు..**

ఉపాధి కూలీలకు ప్రమాదవశాత్తు గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు మెడికల్ కిట్లు అందజేసేవారు. అవి ఇప్పుడు ఎక్కడా కనిపించట్లేదు. గాయాలైన వారిని నేరుగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. స్వల్ప గాయలైన కూలీలు సొంతంగా గ్రామీణ వైద్యుల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు.

**కానరాని నీడ పరదాలు..**

వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో గతంలో ప్రతి గ్రూపు ఒక టార్పాలిన్ టెంట్లు అమర్చుకుని పని చేస్తుండేవారు. ప్రస్తుతం ఆ సదుపాయం లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండొచ్చినా.. వానొచ్చినా పని ప్రదేశంలో తల దాచుకోవడం ఇబ్బంది కరంగా ఉంటుంది. కనీసం భోజనం చేసేందుకు కూడా నీడ సౌకర్యం లేదు.

**కూలీల అవస్థలు ..**

పని ప్రదేశంలో నీటి సౌకర్యం లేక కూలీల గొంతెండుతోంది. వెంట తెచ్చుకున్న బిందె నీళ్లు అరగంటలో అయిపోతుండటంతో కూలీలు నీళ్లకోసం అవస్థ పడుతున్నారు.. ఇప్పటికైన అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు పని ప్రదేశాలను పరిశీలిస్తు నీడ, నీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం..**



ఉపాధి హామీ పని ప్రదేశంలో నీరు, నీడ కల్పించకపోవడంతో కూలీలందరం తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం. మంచినీళ్లు ఇంటి నుంచి తీసుకెళుతున్నాం. అవి కూడా ఒక్కసారికి కూడా రావడలేదు. భోజన సమయంలో నీడ లేక ఎండలోనే తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పటికైన అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

– జంగ జమలయ్య, చౌడవరం

**వసతులు కల్పించాలి..**



ఉపాధిహామీ పనుల వద్ద కూలీలకు ప్రభుత్వం కనీస వసతులు కల్పించడం లేదు. గత ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన టెంట్లు తప్ప కొత్తగా ఏమి మంజురు చేయలేదు. అదే విధంగా మెడికల్ కిట్లు, తాగునీటి వసతులు సైతం మరచిపోయారు. రవాణా చార్జీలు కూడా చెల్లించడం లేదు. ఉపాధిహామీ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి.

– పుచ్చకాయల సోమిరెడ్డి, వెంకటాపురం

### ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**కారేపల్లి:** ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కారేపల్లి మండలంలో ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధీలకు ఎండలు దృష్ట్యా టెంట్లు, మంచినీటి సౌకర్యం, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి మల్లయ్య, పండగ కొండయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు గన్నీ బస్తాలు అందించాలి



కొణిజర్ల సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

**కొణిజర్ల:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా వారికి అవసరమైన గన్నీ బస్తాలు అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం స్థానిక గోపవరం వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, టీడీపీ మండలాధ్యక్షుడు తాతా సుధాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన గన్నీ బస్తాలు సరఫరా చేయక పోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మొక్కజొన్నకు పంటల నమోదు ఆన్‌లైన్ కాలేదని కారణంతో అమ్మకాలకు అడ్డంకులు చెబుతున్నారని అన్నారు. నిబంధనలు తక్షణమే సడలించాలన్నారు. సమస్యలపై అదనపు కలెక్టర్ మధుసూదనరావుతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చలపతిరావు, బత్తిరన్న, శ్రీనివాసరావు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యం



కల్లూరురూరల్: కరపత్రాలను అందిస్తున్న సంభాని



ఎర్రుపాలెం: మాట్లాడుతున్న మల్లు నందిని

**కల్లూరు రూరల్/ఎర్రుపాలెం:** కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మల్లు నందిని విక్రమార్క అన్నారు. బుధవారం కల్లూరు మండలంలోని మెన్నవెల్లి, పెద్దకోరుకొండి గ్రామాల్లో జెండా అవిష్కరణ చేసి, ఇంటింటికీ కాంగ్రెస్ కరపత్రాలను సంభాని అందించారు. ఈ సందర్భంగా సంభాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి ప్రజలకు సుబిక్షపాలన అందిస్తామన్నారు. ఎర్రుపాలెంలోని మీనవోలు గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారమన్నారు. వచ్చే నెలలో భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాలల్లో పీసీసీ సభ్యులు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కిరణ్, శ్రీనివాసరెడ్డి, శౌరి, పుల్లారావు, కృష్ణ, కరుణ, కల్యాణి, రాధాకృష్ణ, వెంకటరెడ్డి, సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ పీసీసీ మెంబర్ శీలం ప్రతాపరెడ్డి ,మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు నర్సింహారావు, జానీబాషా, వేమిరెడ్డి అరవింద్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై దశలవారీ ఉద్యమం



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

**మధిర:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో దశల వారిగా ఉద్యమాలు చేపడతామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో జరిగిన సీపీఎ జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మధిర నియోజకవర్గంలోని పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇవ్వాలని వచ్చే నెలలో పార్టీ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం అవుతున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ కేంద్రాలలో 14 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, ఎస్సీ సర్టిఫికెట్ ఉన్న ప్రతి ఒక్కరికీ దళిత బంధును ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, మధిర టౌన్ కమిటీ సభ్యులు రాధాకృష్ణ, మధిర టౌన్ నాయకులు విల్సన్, నాగేశ్వరరావు, కిషోర్, వెంకట్రావమ్మ పాల్గొన్నారు.

### లెదర్ పార్కు భూమిని పరిశీలించిన అధికారులు



లెదర్ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**మధిర:** మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో లెదర్ పార్కుకు కేటాయించిన భూమిని బుధవారం లిడ్ క్యాప్ జనరల్ మేనేజర్ నాయక్ పరిశీలించారు. మడుపల్లిలో లెదర్ పార్క్ ఏర్పాటు చేసేందుకు 2004లో 26 ఎకరాలను భూమిని ప్రభుత్వం కేటాయించింది. అక్కడ ఎటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో ఆ భూమి అన్యాక్రాంతమవుతుందని ఫిర్యాదులు రావడంతో హైదరాబాదు నుంచి లిడ్‌క్యాప్ జనరల్ మేనేజర్ పరిశీలనకు వచ్చారు. అనంతరం లిడ్ క్యాప్ సభ్యులను, తహసీల్దార్ రాజేష్‌ని లెదర్ పార్కుకు కేటాయించిన భూమి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట లిడ్‌క్యాప్ అధికారులు యాదయ్య, సర్వేయర్ ఉషారాణి, కటుకూరి శ్యామారావు, రాజారావు, జమలయ్య, ఆనందరావు తదితరులు ఉన్నారు.

### సంఘీభావం

**ముదిగొండ:** ముదిగొండ తహసీల్ ఎదుట చేపట్టిన గ్రామదీపికల సమ్మెకు మద్దతుగా బుధవారం అమ్మఫౌండేషన్ చైర్మన్ నందిని, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు సంఘీభావం తెలిపారు. వారి సమస్యలను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, పల్లపాటి కృష్ణ, ఎండీ అజ్గర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

**మధిర:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, సీఎల్పీ లీడర్ మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సిరిపురం గ్రామంలో సావిత్రి, గంగమ్మ, బాబురావు కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఆమె వెంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, దారా బాలరాజు, కర్నాటి రామారావు, దుంపా వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

**కల్లూరు:** సీఎం కప్‌లో భాగంగా కల్లూరు మండల స్థాయి షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు డబుల్స్ అండ్ సింగిల్స్ 15 సంవత్సరాల వయస్సు నుంచి 36 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు 18వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఇండోర్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని పీఈటీ పి.వీరరాఘవయ్య పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కల్లూరు మండల జట్టుగా ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సెల్ నంబర్ 94406 69401ను సంప్రదించాలన్నారు. షటిల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్ తప్పని సరిగా తీసుకు రావాలన్నారు.

### అన్సారీని కలిసిన 'మైనారిటీ' రాష్ట్ర బాధ్యులు



మైనారిటీ కమిషన్ చైర్మన్ అన్సారీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆదిల్‌షరీఫ్

**సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా నియామకం పొందిన తారీక అన్సారీని ఆల్ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఆదిల్‌షరీఫ్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్‌లు బుధవారం హైద్రాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం, క్రిష్టియన్, బుద్ధ, సిక్కు, పార్సి మైనారిటీలకు న్యాయం చేసేందుకు నూతన చైర్మన్ కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్‌అలీ, హబీబ్, సయ్యద్ అహ్మద్ ఉన్నారు.

### వీల్‌చైర్ పంపిణీ

**చింతకాని:** మండలంలోని కొదుమూరు ఉన్నత పాఠశాల ఆవరణలో రామకృష్ణాపురం గ్రామానికి చెందిన దివ్యాంగ బాలుడు తాటి సురేంద్రకుమార్‌కు సమగ్ర శిక్ష అభియాన్, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య బుధవారం వీల్‌చైర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణయ్య, గ్రామసర్పంచ్ సుజాత, ఎంపీటీసీ సభ్యులు హేమ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఐఈఆర్పీ కృష్ణారావు, పారా లీగల్ వలంటీర్ శంకర్‌రావు పాల్గొన్నారు.

### రోగులకు పండ్లు పంపిణీ

**సత్తుపల్లి:** సత్తుపల్లి మాజీ ఎంపీపీ, చైతన్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ మట్టా ఆరోగ్యం జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో బుధవారం డాక్టర్ మట్టా రాగమయి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్లారి వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డాక్టర్ స్రవంతి, దొడ్డా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

**తల్లాడ:** స్థానిక సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మొక్కజొన్న రైతులు మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, సొసైటీ సీఈఓ నాగబాబు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి నిధులు మంజూరు



సీఎం కేసీఆర్‌ను కలిసిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర

**పెనుబల్లి:** సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రూ.50 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరీ జీవో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినట్లు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. బుధవారం ఆయన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కలిసి సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి, సీసీ రోడ్ల నిర్మాణం కొరకు నిధులు మంజూరీ చేయాలని చేసిన విజ్ఞప్తుల మేరకు బుధవారం నియోజకవర్గ అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.50 కోట్లు, అలాగే పెనుబల్లి మండల కేంద్రంలో షాదీఖానా నిర్మాణానికి రూ.75 లక్షల నిధులు మంజూరీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరీ చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

### శానిటేషన్ వారోత్సవాలు ప్రారంభం



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

**ఎర్రుపాలెం:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం పారిశుద్ధ్య వారోత్సాలను ప్రారంభించారు. తొలిరోజు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో కలిసి కార్యదర్శులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారోత్సవాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులను గుర్తించారు. ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఈఓ శ్రీలక్ష్మిలు పర్యవేక్షించారు. ఎంపీపీ దేవరకొండ శిరీష, జెడ్పీటీసీ కవిత, ఏపీడీపీవో కృష్ణశ్రీ, పంచాయతీ కార్యదర్శులు నాగేశ్వరరావు, రాము, సురేష్, నాగిని పాల్గొన్నారు.

### సింగరేణిలో రక్షణ అవగాహన పక్షోత్సవాలు



కిష్టారం ఓసీలో రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

**సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లిలోని కిష్టారం ఓపెన్‌కాస్టులో బుధవారం రక్షణ అవగాహన పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి ఎం.వి.నర్సింహారావు, మేనేజర్ బి.రామకృష్ణలు మాట్లాడుతూ.. భద్రతతో కూడా బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీర్ వరప్రసాద్, రక్షణ అధికారి విక్రమ్‌బాబు, పిట్‌సెక్రటరీ మురళీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

# జమ్మిచెట్టు నుంచి చిరుజల్లు!

- కారేపల్లి పెద్దమ్మతల్లి ఆలయంలో వింత
- తల్లి మహిమే.. అంటూ భక్తుల పూజలు
- లక్కపురుగులు విసర్జన చేస్తుంటాయని ఏఓ వివరణ




జమ్మిచెట్టు నుంచి కురుస్తున్న చిరుజల్లును వీక్షిస్తున్న గ్రామస్తులు, పూజలు చేస్తున్న దృశ్యం

**కారేపల్లి:** ఓ పక్క ఎండలు మండిపోతుంటే.. మరో పక్క కారేపల్లి పెద్దమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న జమ్మిచెట్టు నుంచి చిరుజల్లు కురుస్తోంది. ఈ వింతను చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. బుధవారం ఆలయానికి వచ్చిన భక్తులు జమ్మిచెట్టు కిందకు వెళ్లగా.. చిరుజల్లు కురుస్తుండటంతో ఆశ్చర్యపోయారు. ఇది పెద్దమ్మ తల్లి మహిమే అంటూ.. జమ్మిచెట్టుకు పూజలు చేశారు.

ఇదిలా ఉండగా.. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి కె.ఉమామహేశ్వరరెడ్డిని వివరణ కొరగా.. కొన్ని చెట్లపై ఎక్కువ సంఖ్యలో లక్కపురుగులు ఉంటాయని, ఇవి కొన్ని సందర్భాల్లో నీటిని విసర్జన చేస్తుంటాయని, అవే జల్లు రూపంలో కురుస్తుంటాయని సమాదానమిచ్చారు.

# ముగిసిన 'సీఎం కప్' టోర్నమెంట్



తల్లాడ: క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



బోనకల్‌లో..



కొణిజర్ల: విజేతలకు షీల్డు, సర్టిఫికెట్లు అందజేస్తున్న, ఎంపీపీ గోసు మధు, అధికారులు

**కొణిజర్ల:** ప్రభుత్వం మూడు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ ముగిసింది. గెలిచిన విజేతలకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో షీల్డులు, సర్టిఫికెట్లను ఎంపీపీ గోసు మధు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని రెండింటిని సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలతో మనిషికి మానసిక ఉల్లాసం శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రమాదేవి, తహసీల్దార్ దొడ్డారపు సైదులు, ఎస్సై జె.శంకరరావు, ఎంపీఓ పి.ప్రభాకర్‌రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

**కల్లూరు:** మండలంలో సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, ఎంపీడీఓ బి.రవికుమార్, ఎంపీపీ బీరవల్లి రఘు, నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, పీఈటీ పి.వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

**సత్తుపల్లిరూరల్:** మండలంలోని సదాశివునిపేటలో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో గెలిచిన విజేతలకు ఎంపీపీ దొడ్డా హైమావతి,సర్పంచ్ సరస్వతి, ఎంపీడీఓ సుభాషినిల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, ఉపేందర్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

**ముదిగొండ:** మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడలు ముగిసాయి. గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ హరిప్రసాద్, ముదిగొండ సర్పంచ్ లక్ష్మిలు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ దామోదర్, హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

**బోనకల్:** గెలిచిన క్రీడాకారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వేణుమాధవ్, ఎంఈఓ ఇందిరా జ్యోతి, ఎంపీపీ సౌభాగ్యం, జెడ్పీటీసీ సుధీర్ బాబులు బహుమతులు అందించారు.

**తల్లాడ:** మండలంలోన క్రీడాకారులకు ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు సీఎం కప్ విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎస్సై సురేష్, ఎంపీఓ శ్రీదేవి, ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, తల్లాడ సర్పంచ్ సంధ్యారాణి, ఈఓ ఉమా తదితరులు పాల్గొన్నారు.